కేటీఆర్‌ను కలిసిన పద్మశాలీ సంఘం నేతలు

కేటీఆర్‌కు చండీయాగం ఆహ్వాన పత్రికను అందజేస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 25: సిరిసిల్ల శ్రీ శివ భక్త మార్కండేయ దేవాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా చండీయాగం కార్యక్రమానికి హాజరు కావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌ను పద్మశాలీ సంఘం నాయకులు ఆహ్వానించారు. కేటీఆర్‌ను నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. సిరిసిల్లలో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం నివారణ కోసం ఈనెల 28 నుంచి 31 వ తేదీ వరకు నిర్వహిస్తున్న చండీయాగానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఇక్కడ పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, ఉపాధ్యక్షుడు గాజుల బాలయ్య, మోర రవి, ప్రధాన కార్యదర్శి మండల సత్యం, పద్మశాలీ కల్యాణ భవనం అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్ దార్నం అరుణ, పద్మశాలీ నాయకులు జిందం చక్రపాణి, బొల్లి రామ్మోహన్, గాజుల నారాయణ, ఏనుగుల ఎల్లయ్య, సామల శ్రీనివాస్, తదితరులున్నారు.

నేతన్న చౌరస్తాలో రాస్తారోకో

సిరిసిల్ల నేతన్న చౌరస్తాలో మానవ హారంతో నిరసన తెలుపుతున్న నేతన్నలు

రాజన్న సిరిసిల్ల, జూలై 25 (నమస్తే తెలంగాణ) : సిరిసిల్ల నేతన్న చౌరస్తాలో నేత కార్మికులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. వందలాదిగా తరలివచ్చి మానవహారంగా ఏర్పడి ప్రభుత్వానికి నిరసన తెలిపారు. రాస్తారోకోతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాలతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలోకి కూరుకుపోయిందంటూ, కార్మికుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని నినదించారు. తక్షణమే ₹15 కోట్ల వస్త్రఆర్డర్లు ఇచ్చి కార్మికులకు ఉపాధి కల్పించాలని, పది హెచ్‌పీ వరకు మర మగ్గాలకు ఉచిత కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వస్త్ర పరిశ్రమకు రావాల్సిన ₹180 కోట్ల బకాయిలు, యారన్ సబ్సిడీ వెంటనే విడుదల చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఈనెల 27న అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో జేఏసీ నాయకులు ఆడెపు రవీందర్, మూషం రమేశ్, పంతం రవి, ఏనుగుల ఎల్లయ్య, స్కైలాబ్ బాబు, కోడం రమణ, రవి, దూడం శంకర్, సామల శ్రీనివాస్, పినగాని రాజేశం, గుంటి వేణు, మండల సత్యం, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిని కాపాడిన పోలీసులు

వృద్ధుడిని దవాఖానకు తరలిస్తున్న పోలీస్ అధికారులు

తెలంగాణ చౌక్, జూలై 25: వర్షపు నీటిలో స్పృహ కోల్పోయి ఉన్న వృద్ధుడిని సిరిసిల్ల టౌన్ పోలీసులు గురువారం గుర్తించి దవాఖానకు తరలించారు. సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన వృద్ధుడు గుంటుక రాజయ్య (81) మూడ్రోజుల క్రితం ఇంట్లోంచి వెళ్లి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసుల బృందం తనిఖీలు నిర్వహించింది. వంశీ కృష్ణ కాలనీలో స్పృహ కోల్పోయి నిస్సహాయస్థితిలో ఉన్న వృద్ధుడిని పోలీసులు గుర్తించి, జిల్లా దవాఖానలో చేర్పించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఇక్కడ పోలీసు అధికారులు బన్సీలాల్, ఉమాపతి, ఎల్లాగౌడ్, రాజేందర్, శ్రీధర్ తదితరులున్నారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచండి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- వేములవాడ ప్రభుత్వ కళాశాల ఆకస్మిక తనిఖీ

తెలంగాణ చౌక్ : అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడ, జూలై 25: విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌కళాశాలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కళాశాలలోని తరగతి గదులను పరిశీలించారు. కంప్యూటర్ ల్యాబ్‌ను కూడా పరిశీలించి విద్యార్థులకు బోధిస్తున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లో జరుగుతున్న పాఠ్యాంశాలను పరిశీలించి బోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గతేడాది ఫలితాలపై ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్‌ను అడిగి సమాచారం తీసుకున్నారు. కళాశాల మైదానంలో నిలిచిన వరదనీటిని తొలగించాలని ఆదేశించారు. విద్యార్థులకు కావాల్సిన మరుగుదొడ్లు, తాగునీటి వసతులను మెరుగుపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్న ఆయన ప్రతిరోజూ హాజరు శాతం పెంచాలని ఆదేశించారు. ఇక్కడ ఆయన వెంట ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్ ఉన్నారు.

ఉన్నత విద్యలో సీట్లు సాధించేలా శిక్షణ ఇవ్వాలి

తెలంగాణ చౌక్, జూలై 25: జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలోని విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తూ ఉన్నత విద్యలో సీట్లు సాధించేలా ప్రత్యేక శిక్షణ అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఉన్నత విద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న ప్రమాణాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంటర్ విద్యార్థులు మ్యాథ్స్, ఆంగ్లం, ఎకనామిక్స్‌లో సామర్థ్యం పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మౌలిక వసతులపై ఆరా తీసి, పలు సూచనలు చేశారు. ఇక్కడ డీఐఈవో సీహెచ్ మోహన్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాళ్లు, సంబంధిత అధికారులున్నారు.

- కాలేజ్‌లో కలెక్టర్ పాఠం

వేములవాడ : జూనియర్‌కళాశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్

వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తనిఖీకోసం వచ్చిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధ్యాపకుడిగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అర్థశాస్త్రంలో డిమాండ్ అండ్ సప్లయ్ అంశం మీద విద్యార్థులకు పాఠాన్ని బోధించారు. అర్థశాస్త్రం మంచి సబ్జెక్టు అని విద్యార్థులతో కలెక్టర్ అన్నారు. పాఠాన్ని బోధించిన అనంతరం పాఠం అర్థమైందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

-వేములవాడ, జూలై 25

డీఎంహెచ్‌వోగా వసంతరావు బాధ్యతల స్వీకరణ

డీఎంహెచ్‌వోను సత్కరిస్తున్న వైద్యశాఖాధికారులు, సిబ్బంది

సిరిసిల్ల టౌన్/కలెక్టరేట్, జూలై 25: రాజన్న సిరిసిల్ల జిల్లా డీఎంహెచ్‌వో(జిల్లా వైద్యాధికారి)గా వసంతరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం నూతనంగా విధుల్లో చేరిన డీఎంహెచ్‌వోను జిల్లా వైద్యశాఖ కార్యాలయ సిబ్బంది శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఇక్కడ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత, డిప్యూటీ డీఎంహెచ్ డాక్టర్ రాజగోపాల్, పరిపాలనాధికారి చేపూరి శ్రీనివాస్, డెమో రాజశేఖర్, డీపీఎంవోలు సురేశ్, శ్రీనివాస్, హెచ్ఈవో లింగం, మహేశ్, తదితరులున్నారు.

జిల్లా వైద్యాధికారికి అభినందన

వసంతరావును కలిసిన చింతోజు భాస్కర్

సిరిసిల్ల టౌన్, జూలై 25: జిల్లా వైద్యాధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వసంతరావును బుధవారం సిరిసిల్ల మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చింతోజు భాస్కర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఆయనతో పాటు పలువురు వైద్యశాఖ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

- సిరిసిల్ల కోర్టు సీనియర్ జడ్జి రాధిక జస్వాల్

కార్యక్రమంలో మాట్లాడుతున్న సీనియర్ జడ్జి రాధిక జస్వాల్

సిరిసిల్ల రూరల్, జూలై 25: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ జడ్జి రాధిక జస్వాల్ అన్నారు. ఈమేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మిషన్ శక్తి 100 రోజుల స్పెషల్ సంయుక్త అవగాహన కార్యక్రమంలో భాగంగా తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలోని బాలికల గురుకుల పాఠశాలలోఅవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఆమె హాజరై, మాట్లాడుతూ, విద్యార్థులు నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, భవిష్యత్తు ప్రణాళిక సూచనలు, హెల్ప్‌లైన్ నంబర్లను వివరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, ప్రిన్సిపల్ పద్మ, ఏజీపీ శ్రీనివాస్‌గౌడ్, న్యాయవాది తిరుపతి, అరుణ, సఖీ, బాల రక్ష భవన్ సిబ్బంది ఉన్నారు.

వానకాలం అప్రమత్తంగా ఉండాలి

- ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

వేములవాడ రూరల్: గంజివాగును పరిశీలిస్తున్న ఏఎస్పీ

వేములవాడ రూరల్, జూలై 25: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి సూచించారు. బుధవారం వేములవాడ శివారులోని వేములవాడ-బోయినపల్లి రోడ్డులోని గంజివాగును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరద ఉధృతి ఉన్న ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లు, హెచ్చరికల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆమె వెంట వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ తదితరులున్నారు.

తెలంగాణ చౌక్/చందుర్తి , జూలై 25: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక నివారణ చర్యలు చేపడుతున్నట్లు జిల్లా పోలీస్ అధికారులు తెలిపారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ప్రధాన రహదారుల వెంబడి ఉన్న మూలమలుపులు వద్ద వేగాన్ని నియంత్రించడానికి బారికేడ్లతో పాటుగా డేంజర్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. చందుర్తిలో ఆర్‌అండ్‌బీ సిబ్బందితో కలిసి మూడపెల్లి నుంచి లింగంపేట వరకు గల ప్రధాన రహదారిపై ప్రమాద హెచ్చరిక బోర్డులు, సూచికలను పోలీసులు పరిశీలించారు.

వేములవాడ టీపీవోగా అన్సారీ

వేములవాడ, జూలై 25: వేములవాడ పురపాలక సంఘం పట్టణ ప్రణాళికాధికారిగా అన్సారీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీలో భాగంగా సాయికృష్ణ సిరిసిల్ల పురపాలక సంఘానికి బదిలీకాగా అన్సారీ వేములవాడకు బదిలీ అయ్యారు.

శ్రమదానం

ఎల్లారెడిపేట, జూలై 25: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం శ్రమదానం చేశారు. కళాశాల మైదానంలో గడ్డి, పొదలను తొలగించారు. ఇక్కడ ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి పరశురాములు, ఉపన్యాసకులు, విద్యార్థులున్నారు.

నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టుకు ఇంటర్వ్యూలు

రుద్రంగి, జూలై 25: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టుకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నేడు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని మండల విద్యాధికారి శ్రీనివాస దీక్షితులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

పరామర్శ

వేములవాడ రూరల్, జూలై 25 : వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపెల్లికి చెందిన గండికొట రాజవ్వ అనారోగ్యంతో మృతి చెందగా ఆమె భౌతికకాయానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి నివాళులర్పించారు. ఆమె మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు పల్లపు లక్ష్మణ్, రాజేందర్, చిన్నశంకర్, దేవయ్య, రాజు, శ్రీనివాస్, శేఖర్, రమేశ్‌లున్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

చందుర్తి, జూలై 25: మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను గురువారం జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఎరువులు ఈపాస్ మిషన్ ద్వారా అందించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతు రుణమాఫీ ఫిర్యాదుల విభాగాన్ని పరిశీలించారు. ఇక్కడ మండల వ్యవసాయాధికారి దుర్గరాజు ఉన్నారు.

ఛత్రపతి విగ్రహాన్ని ఆవిష్కరించాలి

కోనరావుపేట, జూలై 25: మండలంలోని సుద్దాల గ్రామంలో 10 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఛత్రపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించకపోవడం అవమానకరమని భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్‌కుమార్ అన్నారు. గ్రామంలోని చెరువు కట్టపై ఏర్పాటు చేసిన విగ్రహానికి ఉన్న ముసుగు తీయకుండా అవమానపరుస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ ఆంజనేయులకు ఫిర్యాదు చేశాడు.

ఆరోగ్య కేంద్రం పరిశీలన

ఇల్లంతకుంట, జూలై 25 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా డిప్యూటీ వైద్యాధికారి డాక్టర్ రాజగోపాల్ గురువారం ఆకస్మికంగా పరిశీలించారని మండల వైద్యాధికారి డాక్టర్ శరణ్య తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో ఓపీ, ల్యాబ్, ఫార్మసీని పరిశీలించారన్నారు. అనంతరం జిల్లా డిప్యూటీ వైద్యాధికారిని మండల వైద్య సిబ్బంది శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్ శరణ్య, సీహెచ్‌వో శాంత, బాల చందర్, హెచ్ఈవో రమణ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిచిన వాహనాలు

వేములవాడ రూరల్, జూలై 25: వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి వద్ద కొత్తగా నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద లారీ, బస్సు ఆగిపోవడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. కొత్త బ్రిడ్జి నిర్మాణంతో పక్కనే ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డుపై మట్టి అధికంగా ఉండడంతో లారీ, బస్సులు నిలిచిపోయాయి. ఎక్స్‌కవేటర్ సహాయంతో బస్సును తొలగించగా, వాహనాల రాకపోకలు కొనసాగాయి.

విద్యార్థులకు అవగాహన

వేములవాడ రూరల్, జూలై 25: వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ బీసీ హాస్టల్‌లో డ్రగ్స్ నిర్మూలనపై వేములవాడ పట్టణ ఎస్ఐ వీరప్రసాద్ అవగాహన కల్పించారు. సీఐ వీరప్రసాద్ మాట్లాడుతూ, డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఇక్కడ ఎస్ఐ అంజయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

శాంతి భద్రతలకు సహకరించాలి

ముస్తాబాద్, జూలై 25 : శాంతి భద్రతలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ గణేశ్ అన్నారు. నూతనంగా వచ్చిన ఎస్ఐ గణేశ్‌ను తెలంగాణ బీడీ టేకేదార్ సంక్షేమ సంఘం ముస్తాబాద్ మండల సభ్యులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఇక్కడ మండల టేకేదారుల సంఘం అధ్యక్షుడు బద్దెపూరి శ్రీనివాస్, రంగయ్య, కిషన్, రమేశ్, కొంక రాజు, యాడారపు రాజు, తుమ్మ శ్రీనివాస్, వెంకటేశ్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

పాస్ పోర్ట్ పోయినది

ముత్యం కుమార్, S/o: స్వామి, గ్రా॥ తారుపల్లి, మం॥ కాల్వ శ్రీరాంపూర్, జి॥ పెద్దపల్లి అను నాయొక్క పాస్ పోర్ట్ (No: K4135142) 5 నెలల క్రితం మా ఇల్లు కూల్చివేసి మరో ఇంటికి షిఫ్ట్ అయ్యేటప్పుడు పోయినది. దొరికిన వారు సంప్రదించండి.
సెల్: 96033 50915

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571

బాధిత కుటుంబాలకు పరామర్శ

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సెస్ మాజీ చైర్మన్ రమేశ్

చందుర్తి, జూలై 25: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గొస్కుల పల్లి గ్రామానికి చెందిన గొస్కుల కనకవ్వ, పుల్కం మల్లయ్య కుటుంబ సభ్యులను గురువారం సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేశ్ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఇక్కడ మల్యాల లక్ష్మీనారాయణ, బొప్ప వెంకన్న, పుల్కం నరేశ్ ఉన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడ, జూలై 25: రాష్ట్ర బడ్జెట్‌లో వేములవాడ రాజన్న ఆలయానికి నిధులు కేటాయించకపోగా సీఎం రేవంత్ రెడ్డి జిల్లాకు రూ.4వేల కోట్ల నిధులను కేటాయించడాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. అనంతరం బీజేపీ పట్టణాధ్యక్షుడు వేగుల సంతోష్ బాబు మాట్లాడుతూ, వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడంపై ఈ ప్రాంత ప్రజలకు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాజన్న ఆలయ అభివృద్ధిపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌తో కలిసి రావాలని కాంగ్రెస్ నాయకులకు హితవు పలికారు. ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసే క్రమంలో పోలీసులకు బీజేపీ నాయకుల మధ్య తోపులాట జరిగింది. ఇక్కడ బీజేపీ నాయకులు జక్కుల తిరుపతి, పిన్నింటి హన్మాండ్లు, లక్ష్మణ్, శ్రీనివాస్, బిల్లా కృష్ణ తదితరులున్నారు.

విద్యార్థులకు ఉత్తమ విద్యనందించాలి

ఇల్లంతకుంట, జూలై 25 : విద్యార్థులకు ఉత్తమ విద్యనందించాలని జిల్లా విద్యాధికారి రమేశ్ సూచించారు. గురువారం మండలంలోని వెల్జీపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థులకు విద్యాబోధన చేసి ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో పనిచేసి బదిలీ పై వెళ్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులకు టై, బెల్టులు అందించగా డీఈవో చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

లక్ష్మీపూర్ పాఠశాలను తనిఖీ

సిరిసిల్ల రూరల్, జూలై 25: తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలను డీఈవో రమేశ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలోని రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు బోధన తీరును పర్యవేక్షించారు. విద్యార్థులను పాఠ్యాంశాలను అడిగి, వారితో జవాబులు చెప్పించారు. ఆయన వెంట హెచ్ఎం ఆడెపు వేణు, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

మహిళ ను మెస్సేజ్‌లతో వేధించిన ఒకరి అరెస్ట్

రుద్రంగి, జూలై 25: ఫేక్ స్నాప్ చాట్ ఐడీ సృష్టించి గ్రామంలోని మహిళకు మెస్సేజ్‌లు పెట్టి వేధించిన ఒకరిని అరెస్ట్ చేసినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు గురువారం విలేకరులతో తెలిపారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం, గత నెలలో రుద్రంగి గ్రామానికి చెందిన ద్యావల దినేశ్ పేరుతో గుర్తుతెలియని వ్యక్తి ఫేక్ స్నాప్‌చాట్ ఐడీ సృష్టించి గ్రామంలోని మహిళకు మెస్సేజ్‌లు చేయడంతో ఆ మహిళ కుటుంబ సభ్యులు ద్యావల దినేశ్‌తో గొడవకు దిగారు. దీంతో తాను ఆ మెసేజ్‌లు పంపలేదని, ఎవరో తన పేరు మీద ఐడీ క్రియేట్ చేసి మహిళకు పంపారని ద్యావల దినేశ్ సైబర్ పోర్టల్ 1930లో ఫిర్యాదు చేశాడని పేర్కొన్నారు. ఆ ఫిర్యాదు ఆధారంగా రుద్రంగి ఎస్ఐ అశోక్ ఐటీ యాక్ట్‌లో కేసు నమోదు చేసి విచారణ చేయడం జరిగిందన్నారు. ఫేక్ స్నాప్‌చాట్ ఐడీ క్రియేట్ చేసి మహిళకు మెసేజ్‌లు చేసి వేధించిన రుద్రంగి గ్రామానికి చెందిన ద్యావల అజయ్‌ని నిందితుడిగా సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అజయ్ నేరం చేయడానికి వాడిన సెల్‌ఫోన్‌ను సీజ్ చేసి అరెస్టు చేశామని పేర్కొన్నారు. సైబర్ నేరస్తుల పట్ల ప్రతిఒక్కరూ ముఖ్యంగా మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ నేరం బారిన పడితే 1930కి డయల్ చేసి లేదా నేషనల్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

జీవితంపై విరక్తితో రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి ఆత్మహత్య

తెలంగాణ చౌక్, జూలై 25: జీవితంపై విరక్తితో రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ మాలోత్ రవి సిరిసిల్ల పట్టణంలోని బతుకమ్మ ఘాట్ వద్ద గురువారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. టౌన్ సీఐ కె కృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆర్టీసీలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తించిన రవి మూర్ఛవ్యాధి ఉండడంతో వాలంటరీ రిటైర్మెంట్ తీసుకొని, కొన్ని రోజులుగా ఇంటివద్దే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో తాగుడుకు బానిసై, జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. రవి భార్య సక్కుభాయ్, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

రేపటి నుంచి శ్రీఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర మహోత్సవాలు

వేములవాడ టౌన్, జూలై 25 : ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణంలోని శ్రీఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర మహోత్సవాలు ఈనెల 27 నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ చైర్మన్ మహంకాళి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మూడు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించే ఈ బోనాల జాతర మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. శనివారం మొదటిరోజు ఉదయం అమ్మవారికి విశేష అభిషేక పూజలు, అనంతరం శాకంబరీ అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారన్నారు. రెండో రోజు ఆదివారం అమ్మవారికి మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పిస్తారని, సాయంత్రం 6 గంటలకు విజయవాడకు చెందిన ప్రభ బృందం ఆధ్వర్యంలో వైవిధ్యమైన వేషధారణతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమవారం చివరిరోజు అమ్మవారికి పుష్పాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చైర్మన్ మహంకాళి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

నైపుణ్యాలపై అవగాహన పెంపొందించుకోవాలి

వీర్నపల్లి, జూలై 25: విద్యార్థులు చిన్నప్పటి నుంచే జీవన నైపుణ్యాలపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా సంక్షేమశాఖ షీరో ఫెసిలిటేర్స్ అంజలి అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా స్కిల్ డెవలప్మెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ ప్రత్యేకాధికారి నీలిమ, ఉపాధ్యాయులున్నారు.

స్పాట్ అడ్మిషన్లకు కౌన్సెలింగ్

ముస్తాబాద్, జూలై 25 : 2024-25 సంవత్సరానికి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుక